
మధురాంతకం రాజారాం



# మనిషి విలువ

సాయంకాలం. ఇంకా వీధి దీపాలు వెలగలేదు. పరుగెడుతున్న లారీలతో, బస్సులతో, సైకిళ్ళతో హైరోడ్డు సందడిగా వుంది. ప్రయాణీకుల సంరంభంతోను, రిబ్బన్లు, రొట్టెలు, పువ్వులు అమ్ముకుంటున్న కుర్రాళ్ళ కేకలతోను బస్‌స్టాండ్ హోరెత్తిపోతోంది.

హైరోడ్డును, బస్‌స్టాండ్‌ను కలిపే సందుదారికి కుడివైపున ఎల్లోరా హోటలు. ఎడమ వైపున బంగారయ్య బంకు.

చల్లని పానీయాలకు, చెవులూరించే ఫలహారాలకు, చక్కటి సరఫరాలకు ఎల్లోరా హోటలు ప్రసిద్ధి.

ఇప్పుడు చెప్పబోతున్న కథయింకొక పదిహేను నిమిషాల్లో ప్రారంభంకానున్నదనగా ఎల్లోరా హోటల్లో వెల్లవేసిన తెల్లని గోడపైన కొలువుతీరిన గోడగడి

యారం టంగుటంగున ఆ రు సా ర్లు మ్రోగింది.

అంతకుమునుపు ఓ గంట సేపటి నుంచీ ప్రొప్రయిటరు టేబులుపైన అధివసించినరేడియోలోనుంచీ 'ఇలంగై వానోలి' గొంతు చించుకుంటోంది.

అతిథి సేవా పరతంత్రులైన సర్వర్లు ఆనతులను శిరసావహించి అడ్డదిడ్డంగా పరుగెడుతున్నారు. ఫలహార సేవనానికి మధ్యమధ్య నవ్వులు, సంభాషణలుదొర్లిపోతున్నాయి. ఆ అలజడికి తోడు బకెట్లో ప్లేట్లు కడుగుతున్న సవ్వడి ఒకటి!

ఎప్పుడు లోపలికి వెళ్ళాడో, ఎంత సేపున్నాడో మనకు తెలియదు. ఓ పెద్ద మనిషి రెండు రూపాయలదాకా వ్రాకిన బిల్లును చెల్లించి ఈవలికి వచ్చి హోటలు ప్రాంగణంలో నిల్చున్నాడు.

అతడు పొడగరి. అందుకు తగ్గట్టు ఓపాటి స్థూలకాయం అతనిది. చుంగులు జీరాడుతున్న పంచపైన అతడు పసుపు రంగు సిల్కుజుబ్బా వేసుకున్నాడు. పాముకుబుసంలాంటి అంగవస్త్రాన్ని కుడిభుజంపైన్నుంచీ, ఎడమ భుజం క్రిందికి రాదీసి ముడివేశాడు. చేతిలోని గొడుగును, కళ్ళకడ్డంగా నిలిచిన నల్లద్దాల కళ్ళజోడును, చేతి వ్రేళ్ళలోని రవ్వల వుంగరాలను గూడా పేర్కొంటే అతడి బాహ్యవర్ణన యించుమించుగా పూర్తవుతుంది.

హోటలు ముంగిట నిలిచి అతడు ఓ పది నయాపైసల నాణెం వెచ్చించి ఓ కిళ్ళీ కట్టించుకున్నాడు.

అతడికి రేడియోగానం యింపుగా వుంది. కిళ్ళీ కమ్మగావుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా వుంది. కొరత ఒకటే. ఒక పొగచుట్ట!

అతడు చరచరా బంకు దగ్గరికి వచ్చాడు.

బంకుపైన కూర్చున్న బంగారయ్య "దయ సేయండి బాబూ! ఏం కావాలి?" అన్నాడు.

ఈ మర్యాదకేమి లెమ్మన్నట్టు "ఓ పొగచుట్ట యివ్వవోయ్" అన్నాడు పెద్ద మనిషి.

బంగారయ్య పొగచుట్టతోబాటు అగ్గిపెట్టె గూడా సమర్పించు కున్నాడు.

టిఫిను, బీడా, పొగచుట్ట-ఈమూడింటి కలయిక వలన సిద్ధించిన మత్తులో ఆనందపరవశుడౌతున్న పెద్దమనిషి ఎదుటికి, మాసిపోయి మాసికలు పడిన చింపిరి దుస్తులు తొడుక్కున్న పది హేనేళ్ళ కుర్రవాడొకడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"బాబ్బాబూ! పట్టెతెగిపోయినట్టుంది. అరగంటలో రిపేరుచేసి పెడతాను. జోడు తీయించండి దొరా!"

పెద్దమనిషి తన పాదరక్షలవైపు చూచు కున్నాడు. పట్టె తెగిపోయిన మాట నిజమే!

"అరిగిపోయిన లెదర్ తీసేసి మంచి టయర్ వేస్తాను. ఆరు నెల్లు అరగ త్రొక్కినా కిముక్కు మనగూడదు. పని నూసి దబ్బియ్యండి బాబూ!"

"తమరిలా పలకమీద కూచునిచెప్పు లివ్వండి బాబూ! ఒరేయ్ రంగడూ! ఏమనుకున్నావో, అయ్యగారి చెప్పులు అప్పుడే షాపులో కొన్నట్టుండాలి" అంటూ బంగారయ్య రంగడి కొక బేరం దొరకడంలో తన పాత్రను సమయ స్ఫూర్తితో నిర్వహించాడు.

"అలాగేనయ్యా అలాగే!" అంటూ రంగడు చెప్పులు చేతికి తీసుకుని తన తావులోకి వెళ్ళి కూర్చున్నాడు.

రెండు బంకుల మధ్య ఒకటి ఒకటి న్నర మూరల ఖాళీ జాగాలో రంగడు తన మరమ్మతు ఖార్ఖానా ఏర్పాటు చేశాడు. కూర్చోడానికి ఓ గోతంపట్ట. నున్నటి రాయి ఒకటి. కత్తిలాంటి సాధనం ఒకటి. రకరకాల తోళ్ళు, టయిర్లు సూదీ, దారమూ. ఈ పరికరాల మధ్య కూర్చుని రంగడు అప్పుడే వెలిగినవీధి దీపం వెలుగులో చెప్పుల్ని పరిశీలింప సాగాడు.

రంగడి నివాసమెక్కడో ఎవరికీ తెలియదు. ఉదయం ఎనిమిది గంటలకు బంగారయ్య బంకు తెరిచేసరికి అతడు తన పరికరాలుంచుకున్న తోలు సంచితో సహా అక్కడహాజరౌతాడు. వాడు మను షుల ముఖాలు చూడడు. వాళ్ళ దుస్తుల్ని చూడడు. కేవలం పాదాలను మాత్రం చూస్తాడు. కళ్లు మూసుకుంటేచాలు, వాడి మనోఫలకం పైన వెయ్యిరకాల పాద రక్షలు ప్రత్యక్షమౌతాయి. పొడుగాటి పాదాలు. పొట్టిపాదాలు, మొగవాళ్ళ ఆడపాదాలు, ఆడవాళ్ళ మొగపాదాలు బాటా చెప్పులు, కాన్పూర్ షూస్, ఎత్తు మడమల జోళ్ళు...

ప్రపంచాన్ని గురించి రంగడికున్న పరిజ్ఞానం చాలా తక్కువ. కానీ వాడి ఉదరపోషణకు ఆ మాత్రం పరిజ్ఞానం చాలు. మొత్తం మానవజాతిని వాడు నాలుగైదు వర్గాలుగా విభజించాడు. మొదటే బేరంచేసి ఆ ప్రకారం ముట్ట జెప్పేవాళ్లు ఒకరకం. జేబులో చేయివేసి చేతికెంత దొరికితే అంత డబ్బునూ గోతంపైకి విసిరి గబగబా వెళ్ళిపోయే వాళ్లు వేరొకరకం. పావలా పనికి పది పైసలు మాత్రం ముట్టజెప్పి తరువాత ఎంతగింజుకున్నా జేబులో చేయివేయని వాళ్లు యింకొకరకం.

పొద్దుగూకిన తర్వాత చేతికి తగిలిన ఈ బేరాన్ని ఏ రకం క్రింద చేర్చవలసి వస్తుందో మరి! ఆలోచిస్తూ తన పనిలో నిమగ్నుడై పోయాడు రంగడు.

"తమదేవూరు బాబూ?" బాతాఖా నీకి నాందీవాచకం చదివాడు బంగా రయ్య.

తన వూరిపేరేమిటో బంగారయ్యకు తెలియకపోవడం క్షంతవ్యం కాని విష

యంగా తోచిందేమో, పెద్ద మనిషిముఖం చిట్లించి, అతడి వైపు ఎగాదిగా చూస్తూ "నెమళ్ళ దిన్నె" అన్నాడు.

"నెమళ్ళదిన్నా! ఈ మధ్యన తెప్ప తిరణాల జరిగింది అక్కడే గదండీ!"

"అవును మరి! నీ కెలా తెలిసింది?"

"తెలియక పోవడమేమిటి బాబూ! ఎక్కడబడినా ఆ మాటే చెప్పుకున్నారు. తెప్ప తిరణాలే గాక పశువుల పరస గూడా జరిగిందట! మంత్రిగా రొచ్చి బాగా బలిసిన కోడెలకు బహుమానాలు గూడా యిచ్చారట!!"

"నీకు చాలా వివరాలు తెలిసినట్టు న్నాయే! మంత్రిగారు మకాంచేసింది మనలోగిల్లోనే!"

"అలాగా బాబూ?" వినయభారంతో తాబేలులా ముడుచుకుపోతూ అన్నాడు బంగారయ్య.

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి. ఆ వ్యవధిలో బంగారయ్య బుర్రలో హఠాత్తుగా ఓఆలోచన పొడసూపింది.

"ఓ సోడా యిమ్మంటారా బాబూ!"

"ఏం సోడా లేవోయ్! ఆ మాటెత్తితే నాకు డోకొస్తుంది..."

"పోనీ, క్రష్ తీసుకోండి,"

అయాచిత సత్కారాన్ని అతి నిర్లక్ష్యంగా స్వీకరిస్తూ "ఏమిటోయ్! ఇంకా ఎంత సేపు పడుతుందేమిటి?" అని రంగణ్ణి ఒకసారి హెచ్చరించాడు. పెద్ద మనిషి.

"అ యి పో యిం ది బాబూ, అయిపోయింది" అన్నాడు రంగడు.

బంగారయ్య ఖాళీగ్లాసును తీసుకొంటూ పెద్దమనిషి దగ్గరికి జరిగాడు. "బాబూ!ఒక చిన్నమనవి!"

"ఏమిటి?"

"మరేంలేదు. మా అబ్బాయి విశాఖపట్నంలో వుద్యోగంచేస్తున్నాడు. ఉద్యోగంమంచిదే ననుకోండి! మంచికీ, చెడ్డకు ముఖాలు చూచుకోడానికి మాత్రం వీలుండదు. ఈ బ్రతుకులేం శాశ్వతంచెప్పండి! ఎక్కడివాళ్ళు అక్కడ పడివుంటే ఆ తరువాత దేవుడు పెట్టినట్టవుతుంది..."

"రా జీ నా మా పె ట్టి రమ్మన్లేక పోయావా?"

"అబ్బే, ఉద్యోగం దొరకడమంటే నోటి మాటలటండీ? వెయ్యిమంది కాళ్ళ వట్టుకుంటే దొరికింది. ఐనా మీబోటి వాళ్ళు గట్టిగా అనుకుంటే రేపీపాటికి వాడిక్కడికి బదిలీ అయిపోడూ?"

"కావచ్చుననుకో! కానీ యిది బస్సు రూటు గాకపోయె, చక్కెర వర్మిటు గాకపోయే! ఈ మాత్రం పనికిగూడా నోరుతెరచి అడగాలి. అదే వచ్చిన చిక్కు".

"బాబ్బాబూ! తమరలా భావించ గూడదు మీమేలు మరచిపోను..."

'చూద్దాం, ఆలోచిద్దాం' అన్నట్టు పెద్దమనిషి తల పంకించాడు. ఆలోపల



యువ




రంగడుగూడా రిపేరు ముగించేశాడు.

"అడుక్కు చెక్కులాంటి టయరు వేశాను. పట్టెంకు సీలలు దిగ్గొట్టాను. తొడిగి చూడండి దొరా" అన్నాడు.

పెద్దమనిషి జేబుతొడుక్కున్నాడు. ముందూ వెనకా చూచుకున్నాడు. జేబులో చెయివేశాడు. ఓ అయిదు రూపాయల నోటు పైకి వచ్చింది. "నోటుకు చిల్లరుందా?" అతడు బంగారయ్యకేసి చూస్తూ అడిగాడు.

"ఎక్కడిదిబాబూ! ఇంతకుమునుపే ఎవరికో యిచ్చేశాను. ఒరేయ్ రంగడూ! హోటల్లో అడిగిసూడరా" అన్నాడు బంగారయ్య.

హోటల్లో ఎన్ని రూపాయలకైనా చిల్లర దొరుకుతుంది. కానీ ఒక్క

పరతు కనీసం ఒక్క కాఫీ అయినా పుచ్చుకోవాలి. అడిగి లేదనిపించుకుని రంగడు అక్కడినుంచీ అంగళ్ళవైపు పరుగుతీశాడు.

గంట ఏడు కావస్తోంది. హోటల్లో జనం పలచబడిపోయారు. బస్టాండులో సందడి తగ్గుముఖం పట్టింది. రోడ్డులో గూడా రాకపోకల రద్దీ తగ్గిపోతూ వుంది.

చెక్కపైన కూర్చున్న పెద్దమనిషి క్రిందికి దిగి రంగడికోసం ఎదురు తెన్నులు చూడసాగాడు.

"వాడెక్కడికి పోతాడండీ! వచ్చేస్తుంటాడు. తమరింకొక చుట్ట ముట్టిస్తారా బాబూ?" అన్నాడు బంగారయ్య

"వద్దొద్దు. ఎప్పుడోగానీ చుట్టగాల్చే అలవాటు లేదునాకు!"

నాలుగైదు నిమిషాలు నిరీక్షణలో గడిచిపోయిన తరువాత, గడచిపోయిన ప్రతి నిమిషమూ రంగడి పలాయనాన్ని బలపరిచిన తర్వాత ఆఖరుకు రంగడు రానేవచ్చాడు. వచ్చినవాడు ఒంటరిగా రాలేదు. ఓ పోలీసును వెంటబెట్టుకొచ్చాడు.

"ఈయనదేనండీ డబ్బు" అన్నాడు రంగడు. అప్పటికీ సందేహనివృత్తిగాక పెద్దమనిషికేసి చూశాడు పోలీసు.

"అవునయ్యా! నిజమే. నేనే చిల్లర మార్చుక రమ్మన్నాను" అన్నాడు పెద్దమనిషి.

"మన్నించండిసార్! నోటు చేత బట్టుకుని పరుగెడుతుంటే అనుమానం తగిలి పట్టుకున్నాను" అన్నాడుపోలీసు.

పెద్దమనిషి చిరాకుతో పోలీసువాడి వైపు చురచురా చూచి, రంగడి చేతిలోనుంచీ నోటు లాక్కుని "ఉండు, నేను మార్చుకొస్తాను" అని అంగళ్ళవైపుగా వెళ్ళిపోయాడు.

రంగడు తన పరికరాలను తోలు సంచిలోకి సర్దుకోసాగాడు.

పోలీసు కాసేపక్కడే తటపటాయించి తనదారిని తాను వెళ్ళిపోయాడు.

ఏడుగంటలకల్లా యింటికి తిరిగివెళ్ళిపోవడం రంగడి వాడుక; ఆరోజు రాత్రి అతడు ఎనిమిది గంటల వరకూ అక్కడే పడిగాపులుబడి పెద్దమనిషి కోసం వేచి చూచాడు. కానీ ఎంతకూ అతడు ప్రత్యక్షం గాకపోయేసరికి విసుగెత్తి యింటి దారి పట్టాడు.

పెద్దమనిషి తిరిగి రాకపోవడానికి కేవలం అతని మతిమరుపే కారణమై వుండవచ్చు నంటాడు బంగారయ్య. ఆయన ఎన్ని పనులమీద పట్నం వచ్చాడో! వెళ్తుండగా ఈయనకు మార్గంలో ఎవరెదురయ్యారో? ముష్టి పావలా యివ్వాల్సి వస్తుందని ఆయన ముఖం చాటు చేసుకొని వుంటాడని రంగడు సూచిస్తే, వాడి నాలుకను వూడబెరికెయ్యాలన్నంత కోపం వస్తుంది బంగారయ్యకు!

కానీ బంగారయ్యకు రంగడిపైనే గాక తనపైన గూడా కోపం రావడం కద్దు! — లోకంలో తనకంటే బుద్ధిహీనుడు మరొకడుండడు. లేకుంటే తనాయన పేరేమిటో అడిగి తెలుసుకోకపోవడమేమిటి? కొడుకు కళ్ళముందు తిరుగాడే ప్రాప్తం లేనప్పుడు తనకా ఆలోచన స్ఫురించకపోవడంలో విడ్డూరమేముంది? ఊఁ- అంతా తన గ్రహచారం!